# మాఫీ.. మాకు రాలేదు!

**ప్రతి రైతు నోటా.. ఇదే మాట**

- 'రుణమాఫీ'లో తమ పేర్లు లేవంటూ అన్నదాతల ఆవేదన
- బ్యాంకులు, సొసైటీల వద్దకు పరుగులు
- పొంతనలేని సమాధానాలు చెబుతున్న అధికారులు
- డీసీసీబీలో పావువంతు మందికే మాఫీ వర్తింపు
- 'పహాణీ'పై తీసుకున్న రైతులకు మొండి'చేయి'
- రూ.లక్షలోపే ఇంత కోత.. రూ.2 లక్షల్లో ఎంత వడపోతో..
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

రుణమాఫీ మాకు రాలేదంటే.. మాకు రాలేదంటూ ఎంతోమంది రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం విడుదలైన రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాలో తమకు మొండి'చేయి' చూపడంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం కొండంత ఆశతో బ్యాంకులు, సహకార సొసైటీల వద్దకు పరుగులు తీసిన అన్నదాతలు తమకు రుణమాఫీ కాలేదని తెలుసుకొని నిరాశతో వెనుదిరిగారు. బ్యాంకు అధికారులు చెప్పిన పొంతనలేని సమాధానాలు విని విస్తుపోయారు. రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేయడంలోనే ఇంతమందిని కోత పెడితే.. ఇక రూ.2 లక్షల్లో ఎంత మందిని వడపోస్తారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

-ఖమ్మం, జూలై 19
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**ఖమ్మం జిల్లాలో లక్షలోపు జాబితాలో రైతులు : 59,172**
**మంజూరైన రుణమాఫీ : రూ.264.23 కోట్లు**

**భద్రాద్రి జిల్లాలో లక్షలోపు జాబితాలో రైతులు : 28,019**
**మంజూరైన రుణమాఫీ : రూ.132.07 కోట్లు**

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ ఖమ్మం జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతులకు అనేక తిప్పలు తెచ్చిపెట్టింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా రూ.లక్ష లోపు పంట రుణాల మాఫీకి సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైన సంగతి విదితమే. దీనికి ఒకరోజు ముందుగానే లబ్ధిదారుల జాబితాను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. రుణమాఫీ సందర్భంగా సాయంత్రం రైతు వేదికల్లో కాంగ్రెస్ నాయకులు, అధికారులు రుణమాఫీ సంబురాల పేరుతో హంగామా కూడా చేశారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అసలు రుణమాఫీకి అర్హత కలిగిన రైతులు ఎవరు? జాబితాలో పేరులేని రైతులు ఎవరిని సంప్రదించాలి? అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయకపోవడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం భారీ వర్షం కురుస్తున్నప్పటికీ బ్యాంకులు, సొసైటీ కార్యాలయాల చుట్టూ రైతులు తమ రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు ప్రదక్షిణలు చేశారు. ఉదయం 10 గంటలకే ఆయా గ్రామాల రైతులు కార్యాలయాలకు చేరుకొని జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను వివరణ కోరగా.. ఒక్కొక్కరు ఒక్కో రీతిన సమాధానాలు చెప్పడం గమనార్హం. జాబితాలో పేరు ఉంటే ఉన్నట్లు లేకపోతే మేం ఏమి చేయలేమని పేర్కొనడం విశేషం. మరికొందరు బ్యాంకు మేనేజర్లు క్రమపద్ధతిలో జాబితా వస్తుందని దాటవేత ప్రయత్నం చేశారు. జాబితాలో పేర్లు ఉన్నవారి కంటే.. లేనివారే అధికంగా ఉన్నట్లు ఆరా తీశారు. రెండు బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నందున వారి పేర్లు జాబితాలో లేవని అధికారులు వివరణ ఇచ్చారు. రేషన్‌కార్డులో ఇద్దరి పేర్లు ఉంటే కూడా రుణమాఫీ రాలేదని మరికొందరు రైతులు వాపోయారు. దీంతో జిల్లావ్యాప్తంగా 76 సొసైటీలు, మరో 30 సహకార బ్యాంకులకు తోడు, ఇతర వాణిజ్య, ప్రైవేట్ బ్యాంకుల్లో సైతం ఇదే పరిస్థితి కనిపించింది.


ఖమ్మం రూరల్ మండలంలో రుణమాఫీ చెక్ చేసుకుంటున్న రైతులు

## డీసీసీబీలో పావువంతు రైతులకే..

రైతులకు పంట రుణాలు ఎక్కువగా ఇచ్చే బ్యాంకు కేవలం జిల్లా సహకార బ్యాంకు మాత్రమే అని చెప్పొచ్చు. రుణమాఫీ జరిగిన ప్రతిసారి ఉమ్మడి జిల్లాలో కనీసం 40 శాతం మంది రైతులు డీసీసీబీ, సహకార సంఘాలకు చెందిన వారే ఉండేవారు. ఈ సంవత్సరం కూడా రుణాలు పొందిన జాబితాలో ఖమ్మం డీసీసీబీ ఖాతాదారులే ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం ఖమ్మం డీసీసీబీ నాలుగు జిల్లాల్లో 50 బ్రాంచీలు, మరో 100 ప్రాథమిక సహకార సంఘాలతో కలిగి ఉంది. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు 1,69,864 మంది ఉన్నారు. పంట రుణమాఫీకి సంబంధించి రూ.908.27 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే ఖమ్మం జిల్లాలో 1,16,291 మందికి రూ.647.76 కోట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 47,003 మందికి రూ.235.23 కోట్లు, ములుగు జిల్లాలో 1,375 మందికి రూ.6.50 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో 5,195 మంది రైతులకు రూ.18.33 కోట్లు రావాల్సి ఉంటుంది. తొలివిడతకు సంబంధించి రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు 1,43,327 మంది కాగా, వారికి రూ.526 కోట్లను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. అయితే గురువారం రాత్రి విడుదలైన నిధులను పరిశీలిస్తే లక్షలోపు పంట రుణాలు తీసుకున్న కేవలం 37,625 మంది రైతులకు రూ.121.63 కోట్లను మాత్రమే విడుదల చేశారు. అంటే కనీసం పావుశాతం మంది రైతులకు మాత్రమే నేటివరకు రుణమాఫీ వర్తించినట్లైంది.

## రైతువేదికల్లో లబ్ధిదారుల వివరాలు

**– సందేహాల నివృత్తికి 'టోల్ ఫ్రీ'**

రైతు రుణమాఫీ జాబితాను ఆయా రైతువేదికల్లో ప్రదర్శించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయనిర్మల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న రైతులు జిల్లావ్యాప్తంగా 57,857 మంది ఉన్నారన్నారు. రుణమాఫీకి సంబంధించిన ఎలాంటి సందేహాలనైనా తీర్చడానికి వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందన్నారు. రైతులు పూర్తి వివరాలు తెలుసుకునేందుకు గ్రామస్థాయిలో జాబితాను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇతర సందేహాలకు స్థానిక ఏఈవోలను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మండల, జిల్లాస్థాయిలో సైతం పరిష్కార విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం మూడంచెలుగా పరిష్కార వేదికలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1950 లేదా సెల్‌నెంబర్ 9063211298 ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య పనిదినాల్లో సంప్రదించాలని రైతులకు సూచించారు.


రూరల్ మండలం ఏపీజీవీబీలో తమ రుణమాఫీ వివరాలపై ఆరా తీస్తున్న రైతులు

### వివరాలు ఎవరూ చెప్పట్లే..



నాకు, నా భార్య పేరుమీద అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో రూ.96 వేల రుణం ఉంది. రుణమాఫీ జాబితాలో నా భార్య పేరు వచ్చింది. మా ఇద్దరి పేరున రూ.లక్షలోపు మాత్రమే రుణం ఉంది. దీనిపై ఎవరిని అడిగినా వివరాలు చెప్పట్లేదు. బ్యాంక్‌కు వెళ్లి అడిగితే.. నా భార్య ఖాతాలో, నా ఖాతాలో నగదు జమ కాలేదని చెప్పారు. రూ.లక్షలోపు రుణం ఉన్న ప్రతి ఒక్కరికి మాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. నా రుణం మాఫీ అవుతుందా? లేదా? అనేది అర్థం కావడం లేదు.

**–మాయర శ్రీను, రైతు, రామకృష్ణాపురం, అన్నపురెడ్డిపల్లి మండలం**

### మా అమ్మ రుణం మాఫీ కాలేదు..



మా ఇంట్లో మొత్తం ముగ్గురం పంట రుణాలు తీసుకున్నాం. నాకు, మా తమ్ముడికి, మా అమ్మకు వేర్వేరుగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయి. మేం ముగ్గురమూ ఒకే రోజు సొసైటీలో పంట రుణాలు తీసుకున్నాం. అందరివి కలిపినా రూ.లక్షలోపు పంట రుణాలే. ఈ రుణమాఫీ జాబితాలో నా పేరు, మా తమ్ముడి పేరు వచ్చింది. కానీ మా అమ్మ పేరు రాలేదు. ఆమెకు రుణమాఫీ కాలేదు. మా అమ్మ పేరు మీద ఉన్న అర ఎకరం సాగు భూమిపై 2023 అక్టోబర్‌లో రూ.26 వేల పంట రుణం తీసుకున్నాం. మా అమ్మ పేరు రాలేదని సొసైటీలో అడిగితే.. కలెక్టర్ ఆఫీసుకు వెళ్లి కనుక్కోమని చెబుతున్నారు. మాలాంటి వారు ఎన్ని చోట్లకని వెళ్లాలి?

**–చల్లా నర్సింహారావు, దివ్యాంగ రైతు, తనగంపాడు, ఖమ్మం రూరల్**

### రైతుల సందేహాలను ఎలా నివృత్తి చేయలో తెలియడం లేదు..



రుణమాఫీ ఎందుకు రాలేదని రైతులు అడుతుంటే సరైన సమాధానం మా దగ్గర ఉండడం లేదు. వారి సందేహాలను ఎలా నివృత్తి చేయాలో తెలియడం లేదు. జాబితాలో పేరు ఉంటేనే రుణమాఫీ అవుతున్నట్లు అని చెబుతున్నాం. రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్నవారిలో చాలామంది రైతుల పేర్లు జాబితాలో లేవు. దీంతో వారంతా వచ్చి ప్రశ్నలు అడుగుతున్నారు. పంట రుణాలు తీసుకున్న రైతులందరి రుణాలనూ ప్రభుత్వం మాఫీ చేస్తే బాగుంటుంది. మా సొసైటీలో రూ.13 కోట్ల రుణాలకు గాను తొలివిడతలో కేవలం రూ.2 కోట్లను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది.

**–జర్పుల లక్ష్మణ్‌నాయక్, సొసైటీ చైర్మన్, ఏదులాపురం**

### రూ.11 వేల రుణమాఫీ కాలేదు..



నాకు క్రాప్‌లోన్ రూ.11,400 బేతంపూడి సొసైటీలో ఉంది. ప్రభుత్వం చెప్పినట్లుగా రుణమాఫీ కాలేదు. గతంలో ఒక్కసారి మాత్రమే రుణమాఫీ వచ్చింది. తర్వాత ప్రతి ఏటా వడ్డీ కడుతున్నా. ప్రస్తుతం సొసైటీలో సభ్యుడిగా ఉన్నా.. జాబితాలో నా పేరు లేదు. నాకు న్యాయం చేయండి సారూ..

**–మాలోతు లాక్య. రైతు, ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామం, టేకులపల్లి మండలం**

### బ్యాంకోళ్లు సమాధానం చెప్పట్లేదు..



నేను టేకులపల్లి ఎస్‌బీఐలో రూ.61 వేల వ్యవసాయ రుణం తీసుకున్నా. కానీ.. నిన్న ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు లేకపోవడం ఆందోళనగా ఉంది. దీని గురించి బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. ఇప్పుడు దీని గురించి ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

**– లాల్‌సింగ్,రైతు, దాస్‌తండా, టేకులపల్లి మండలం**

### వడ్డీతో సహా కట్టాలంటున్నారు..



నాకు రెండెకరాల పొలం ఉంది. 2019 జనవరి 2న మా గ్రామంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.45 వేల పంట రుణం తీసుకున్నాను. ఈ ఏడాది కాలం కలిసిరాక పంటలు పండలేదు. దీంతో అప్పు చెల్లించలేకపోయాను. అది వడ్డీతో కలిపి రూ.76 వేలు అయింది. రూ.2 లక్షల్లోపున్న పంట రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికలప్పుడు కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక నిన్న (గురువారం) రూ.లక్షలోపున్న రుణాలను మాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నా పంట రుణాన్ని కూడా మాఫీ చేసిందనే అనుకున్నాను. శుక్రవారం ఉదయం బ్యాంకుకు వెళ్లి అక్కడి అధికారులను అడిగాను. నా పంట రుణం మాఫీ కాలేదని వాళ్లు చెప్పేసరికి నాకు గుండె జారినంత పనైంది. ఇప్పటికే నా రుణం డీఫాల్ట్ అయిందని చెప్పారు. రుణమాఫీ కూడా కాలేదని చెప్పారు. ఇప్పుడు వడ్డీతో కలిపి మొత్తం రుణాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. చెల్లించకుంటే ఎలాగైనా రికవరీకి ఆదేశిస్తామని చెప్పారు. కొన్నాళ్లుగా నా ఖాతాను కూడా హోల్డ్‌లో పెట్టారు. అంతకుమునుపట రైతుబంధును కూడా బ్యాంకు అధికారులు తీసుకోనివ్వలేదు. రూ.2 లక్షల్లోపున్న పంట రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు నా పంట రుణాన్ని మాఫీ చేయలేదు.

**–పాకనాటి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, వల్లభి, ముదిగొండ మండలం**

## గోదావరి @ 27 అడుగులు



భద్రాచలం, జూలై 19 : ఎగువన ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం పెరుగుతోంది. గురువారం రాత్రి 7 గంటలకు 18.2 అడుగులు ఉన్న గోదావరి క్రమక్రమంగా పెరుగుతూ శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 26.3 అడుగులకు చేరింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు 27.1 అడుగుల మేర ప్రవహిస్తోంది. నదీ పరీవాహక ప్రాంతాలతోపాటు ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వరద మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శివారు కాలనీలు బురదమయమయ్యాయి.

# వదలని వాన..

- జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం
- కుంటలు, చెరువులకు చేరుతున్న వరద
- నగరంలో రోడ్లపైకి చేరిన మురుగు నీరు
- రహదారులపై అవస్థపడిన నగర ప్రజలు


ఖమ్మం నగరంలో ప్రధాన రహదారిపై చేరిన వరదనీరు




ఖమ్మం వ్యవసాయం, జూలై 19 : అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం చెదురు మదురు జల్లులకే పరిమితం కాగా.. రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాయంత్రం నగరంలో కురిసిన భారీ వర్షంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల నుంచి ఇంటికి చేరుకునేందుకు ఉద్యోగులు, సిబ్బంది నానా యాతనపడ్డారు. విద్యార్థులు సైతం వ్యయప్రయాసలకు లోనయ్యారు. ప్రధాన వీధులు జలమయం కావడం, నాలాలు పొంగడంతో వరద నీరు రోడ్లపైకి వచ్చింది. శుక్రవారం కురిసిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో సాగు పనులు పూర్తి చేసుకున్న రైతులు పొలాలను దుమ్ము చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరో వారం రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఈ నెల చివరి వరకు వరినాట్లు పూర్తి చేసుకునేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. గడిచిన 24 గంటల్లో (గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు) జిల్లావ్యాప్తంగా 24.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేంసూరు మండలంలో 64.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. సత్తుపల్లి మండలంలో 52.6 మి.మీ, కల్లూరు 45.8 మి.మీ, పెనుబల్లి 34.8 మి.మీ కాగా, మిగిలిన మండలాల్లో 10 నుంచి 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మరో 11.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కామేపల్లి మండలంలో 43.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. సింగరేణి, వేంసూరు మండలాల్లో 30 మి.మీ వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం జిల్లాలో రెడ్ అలర్ట్ కొనసాగుతుండడంతో రాగల రెండు మూడు రోజులపాటు జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## మూడు మండలాల్లో తెరిపివ్వని వర్షం

- అలుగుపోస్తున్న బేతుపల్లి చెరువు
- పొంగి ప్రవహిస్తున్న లంకాసాగర్ ప్రాజెక్టు


పెనుబల్లి : పొంగిపొర్లుతున్న లంకాసాగర్


సత్తుపల్లి : అలుగు పారుతున్న బేతుపల్లి చెరువు

సత్తుపల్లి/వేంసూరు/పెనుబల్లి, జూలై 19 : సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు అలుగు పారుతోంది. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం 16 అడుగులు కాగా.. శుక్రవారం ఉదయం 17 అడుగులకు నీరు చేరింది. దీంతో ఐబీ అధికారులు 100 క్యూసెక్కుల నీటిని బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువకు, మరో 4,300 క్యూసెక్కుల నీటిని అలుగు ద్వారా బయటకు వదులుతున్నారు. వరద ఉధృతిని ఐబీ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ వెంకటేశ్వరరావు పరిశీలించారు. అలాగే జీవీఆర్ ఓసీలో 77 మి.మీ వర్షపాతం నమోదుకాగా.. 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. కాగా.. మరో 50 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత నిలిచిపోయింది. కిష్టారం ఓసీలో 60 వేల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత, 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లు పీవోలు చారి, నర్సింహారావు తెలిపారు. వేంసూరు మండలంలో వర్షాలతో చెరువులు నిండడంతోపాటు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కందుకూరు–దుద్దేపూడి గ్రామాల మధ్య ఉప్పువాగు పొంగి ప్రవహిస్తుండడం.. తుంగవారికాలనీ వద్ద వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పెనుబల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లంకాసాగర్ మధ్యతరహా ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తోంది. ప్రాజెక్టు నీటిమట్టం 16 అడుగులు కాగా.. అది నిండిపోయి రెండు అంగుళాలు పైకి రావడంతో అలుగు పొంగి ప్రవహిస్తోంది. లంకపల్లి, ఏరుగట్ల, శ్రీనివాసపురం, చౌడవరం, మండాలపాడు గ్రామాల నుంచి వరద నీరు ప్రాజెక్టులోకి చేరింది. వీఎం బంజర బస్టాండ్ ప్రాంగణానికి వెళ్లే మార్గమధ్యలో జలమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. అలాగే పురవీధుల్లో వరద నీరు ప్రవహించింది.



















